



-యెలిశెట్టి శంకరరావు

సన్నని పొగమంచు చీల్చుకొని ఘాట్‌రోడ్డుమీద మెలికలు తిరుగుతూ సాగిపోతూంది కారు. పొడవాటి టేకు, రోజువుడ్, వల్లమద్ది చెట్లు రోడ్డుకు రెండు పక్కలా నిలబడి హుందాగా తలలు ఊపుతున్నాయి. పైన్ చెట్ల వరసలు పచ్చగా పహరా కాస్తున్న సైనికుల్లా ఉన్నాయి. చుట్టూ కొండలు నిద్రపోతున్న ఏనుగుల్లా, మెలికలు తిరుగుతున్న తారురోడ్డు తాచు పాములా ఉన్నాయి. పచ్చటి ప్రకృతి పట్టుచీర కట్టుకున్న పడుచు పిల్లలా ఉంది. చిన్న చిన్న పల్లెల్ని దాటుకుంటూ వడి వడిగా పరుగెడుతూంది కారు.

పచ్చని పొలాలు, కొండలమీదుగా ఒదిగి ఉన్న కాఫీ తోటలు, నిర్మలంగా కనుపించే అమాయకమైన గిరిజనుల మొహాలు, స్వచ్ఛమైన గాలి—వోహో!

"ఈ ప్రాంతం నాకు బాగా నచ్చింది. ఇక్కడో చిన్న ఇల్లు కట్టుకుని జీవితాంతం ఇక్కడే ఉండిపోతే బాగుండును." పరవశంగా పైకే అనేశాను.

"ఇప్పుడో ఇల్లు మాత్రం కట్టుకుని ఉంటే సరిపోతుంది. హాయిగా ఉంటానని అనిపిస్తుంది. కాకపోతే ప్రాంతానికి నాయకురాలివై పోవాలనిపిస్తుందేమో? వాంట్స్ ఆర్ అన్‌లిమిటెడ్! కోరికలు అనంతాలు. యూ నో?" చిరునవ్వుతో అన్నాడు శ్రీహరి.

చెప్పవద్దూ? ఉక్రోషం వచ్చింది. "నాన్సెన్స్! మీ బోడి 'ఎకనమిక్సు' పాటాలు బొడ్డూడని బి. ఎ. గుంట వెధవలకు చెప్పుకోండి. వాళ్ళయితే బుద్ధిగా మీ వాగుడంతా భరిస్తారు." గట్టిగానే అనేశాను.

కారు నడుపుతున్న మోహనకృష్ణ, పక్కనున్న సంధ్య—ఇద్దరూ త్రుళ్ళిపడి వెనక్కి చూసేరు.

"వాట్ హాపెండ్? మీ ఇద్దరూ కీచులాట మొదలెట్టారేమిటి!" నవ్వుతూ అడిగేడు మోహన్.

"నథింగ్! జస్ట్ ఎ మేటర్ ఆఫ్ నో ఇంపార్టెన్స్! ఆ రెండు కాఫేస్?" శ్రీవారి ప్రశ్న.

"దిగండి. ఇక్కడికో ఫర్లాంగు దూరంలో జలపాతం ఉంది. పక్కనే 'వేలీవ్యూ' కూడా ఉంది. రెండు ఫోటోలు తీసుకుని వెళదాం." కేమెరా తీసుకుని కారు దిగుతూ అన్నాడు మోహన్.

నేను, శ్రీవారు, సంధ్య కారు దిగి మోహనకృష్ణను అనుసరించేము.

"ఏమిటి మీ కీచులాట?" నవ్వుతూ ప్రశ్నించింది సంధ్య.

"ఇదిగో, మీ అన్నయ్యగారు కోరికలు అనంతాలని, అవి ఒక దాని వెనక ఒకటి పుట్టుకువచ్చేస్తుంటాయని సెలవిస్తున్నారు." వెక్కిరిస్తున్నట్టన్నాను.

శ్రీవారు నా వెక్కిరింతని కూడా స్పోర్టివ్‌గా తీసుకున్నారు.

"ఏరా, మోహన్! నా పాయింటు కరెక్టు కాదా?" మోహన్ సపోర్టు తీసుకుంటూ అడిగేరు.

అవునన్నట్టు తల వూపేడు మోహన్.

"అదేలా? ఈ చరాచర ప్రపంచంలో, ఈ సృష్టిలో ప్రతిదానికీ అంతం ఉంటుంది కదా?" సంధ్య అమాయకమైన ప్రశ్న.

"నో, నో! అది వేరు. ఫిలసాఫికల్ ధోరణిలో మాట్లాడుతున్నావు. ఈ దేశం, ఈ ప్రపంచం మొత్తం నడిచేది 'కోరికలు అనంతం' అనే సిద్ధాంతం మీదే! మనుషుల జీవనోపాధి ఈ ఆర్థిక వ్యవస్థ మీదే ఆధారపడి ఉంది. ఈ వ్యవస్థ మూల సిద్ధాంతాన్నే మీరు కాదనేస్తే ఎలా?" శ్రీవారి ప్రశ్న.

ఒళ్ళు మండింది నాకు.

"వూరుకోండి. ఫస్టు తారీఖున పట్టుచీర కొనమంటే సంతోషంగా కొంటారు. రెండవ తారీఖున ఇంకో చీర కొనమని పట్టుబడితే ముఖం మాడ్చుకుని కొంటారు. మూడవతారీఖున మరొక చీర కొనమంటే ముఖంమీద కొడతారు. అవునా? అంటే, నేను తృప్తి పడుతూ సర్దుకుపోతున్నట్టే కదా? అంటే, ఇక్కడ కోరికకు ఒక అంతం ఉన్నట్టే!" శ్రీవారిని దబాయించాను.

"అదే! ఈ నెలకు ఒక చీరతో తృప్తి పడతావు. పై నెలలో అయినా మరొకటి కావాలంటావుగా! అలాగే మానవ వ్యవస్థలో మనుషు లందరికీ కోరికలు




జుట్టు అద్భుతంగా ఉండేటట్టు చేసేది రీటా. దానిలో అటువంటి శక్తి, సువాసనా ఉన్నాయి - శిరోజాలు సహజంగా, చక్కగా పెరగడానికీ, చల్లదనానికీ, దానికదే సాటి.

రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి. మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా ఉంటాయి.




రీటా

నేడే ఒక సీసా కొనండి
ప్రతిచోటా దొరుకును

స్త్రీలూ పురుషులూ

ఇప్పుడు సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది.

ఉంటాయి. అలా కాకుండా అందరూ ఋషుల్లా కోరికలు చంపేసుకుని, ముక్కులు మూసుకుని అడవుల్లో తపస్సు చేసుకుంటూంటే మానవ జీవితమే ఉండేది కాదు.'' శ్రీవారి ఉవాచ.

''యస్! కరెక్టురా!' శ్రీవారి పాటకు మోహన్ తందాన తాన.

''నో! అదే థీరీ ప్రకారం జరిగితే ఉన్నవాణ్ణి లేనివాడు కొల్లగొడుతూ, దోపిడీలతో, దురాక్రమణలతో, అరాచకంతో మానవ వ్యవస్థ అంతా అనంత కోరికల వాహినిలో ఎప్పుడో అంతం అయిపోయి ఉండేది.'' రోషంగా అంది సంధ్య.

''సంధ్యా! మనిషి ఎప్పుడూ సరళ రేఖ లాంటి జీవిత పథంతో అనుక్షణం కోరికల గుర్రం మీద స్వారీ చేస్తూనే ఉంటాడు.'' తన వాదనను బలపరుచుకుంటూ, అదేదో సినిమాలో నాగేశ్వరరావులా యమ సీరియస్సుగా అన్నారు శ్రీవారు.

''సైకలాజికల్‌గా మనిషిలో రాజీ తత్త్వం ఉంది. తన కోరికల్ని తృప్తి పరుచుకోవడానికి అనుక్షణం సతమతమవుతూ, పక్కవాడిని నంజుకు తినేద్దామన్న వ్యూహంతో మనిషి ఎప్పుడూ ఉండడు. మనిషి ఎప్పటికప్పుడు తృప్తి పడుతూ ఉంటాడు కనకనే ఇంకా ఈ ప్రపంచం ఇలా మిగిలి ఉంది.'' ఆవేశంగా అన్నాను నేను.

''మన మేమీ మృగాలం కాదు పక్కవాణ్ణి తినేసైనా మన అస్తిత్వం స్థిరపరుచుకోవటానికి. తృప్తి, అనేది మన నరనరాల్లోనూ జీర్ణించుకుపోయింది. కావలిస్తే ఈ విషయాన్ని నేను రుజువు చేస్తాను.'' శాంతంగా అంది సంధ్య.

''అవకాశం వస్తే నా వాదనే నిజమని నేనూ నిరూపిస్తాను.'' మరింత పట్టుదలగా పలికేరు శ్రీవారు.

''సరిలే. వూరుకోండి.'' అందరం రెచ్చిపోవటం చూసి హెచ్చరించేడు మోహన్.

ఈలోగా జలపాతం చేరుకుని ఫోటోలు తీసుకున్నాము. నాలుగు వందల అడుగుల ఎత్తునుంచి ఒయ్యారంగా ప్రవహిస్తోంది జలపాతం.

మనోజ్ఞమైన దృశ్యాన్ని మైమరచి తిలకించాము. మరో రెండు ఫోటోలు తీసుకుని తిరిగి వచ్చి కారులో కూర్చున్నాము. కారు మెలికలు తిరుగుతూ పడుచు పిల్ల సిగ్గులా ముందుకు సాగింది.

*  *  *  *

మోహనకృష్ణ, సంధ్య మా ఫామిలీ ఫ్రెండ్స్ ఇద్దరూ లైఫ్ పార్ట్‌నర్స్. సంధ్య కె. జి. హెచ్. లో ఐ స్పెషలిస్టు. మోహన్ ప్రైవేటు ప్రాక్టీసు చేస్తున్నాడు. శ్రీవారు ఎ. వి. ఎన్. కాలేజీలో ఎకనమిక్స్ లెక్చరర్. బొత్తిగా యాంత్రికమైన పట్నం జీవితంతో విసిగి నాలుగు రోజులు రిలీఫ్‌గా ఉంటుందని సీలేరు వచ్చి తిరిగి వెళుతున్నాము. ఇంతలో ఇది. ఆర్గ్యుమెంట్ కాదు కాని, బుర్ర పాడైపోయింది.

ఆలోచనల్లో ఉండగానే సుమారు వంద కిలోమీటర్లు ప్రయాణం చేసి, చిన్న వూరు చేరుకున్నాము. రోడ్డుకు ఒక పక్క కారు ఆపి, ''ఇక్కడ టీ తీసుకుందాం. మళ్ళీ ఘాట్ రోడ్డు అయిపోయే

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## దుర్మతి ఉగాది నవలల పోటీ

దుర్మతి ఉగాది సందర్భంలో ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నవలల పోటీ నిర్వహిస్తున్నది. నవలల ఎన్నిక ఎప్పుడూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికదే అగ్రతాంబూలం అని పాఠకులకు తెలుసు. మంచి నవలలను మాత్రమే ఎన్నిక చేసి ఉత్తమ రచయితలను, రచయిత్రులను ప్రోత్సహించడం మా సంప్రదాయం. ఈసారి కూడా ప్రముఖ రచయితలు, రచయిత్రులు, కొత్తవారు ఉత్సాహంగా పోటీలో పాల్గొంటారని ఆశిస్తున్నాము

| | |
|---|---|
| మొదటి బహుమతి | రు 5,000 |
| రెండవ బహుమతి | రు 3,000 |
| మూడవ బహుమతి | రు 2,000 |

నిబంధనలు

★ నవల అరటావు సైజు (ఫూల్‌స్కాప్) కాగితాలలో 250 పుటలు ఉండాలి.

★ సిరాతో కాగితానికి ఒక పక్కనే వ్రాయాలి.

★ నవలా వస్తువు తెలుగువారి జీవితానికి సంబంధించినదై ఉండాలి.

★ అనువాదాలు, అనుసరణలు పోటీకి పనికిరావు.

★ కవరు పైన 'ఉగాది నవలల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.

★ బహుమతి పొందని నవలల్లో యోగ్యమైనవి వారపత్రికలో మామూలుగా ప్రచురించుకునే హక్కు మాకు ఉన్నది.

★ ప్రచురణకు స్వీకరించని నవలలు తిప్పి పంపే నిమిత్తం తగినంత పోస్టేజి అంటించిన అడ్రెసు ఉన్న కవరు నవలలో జత పరచవలసి ఉంది. లేకపోతే తిప్పి పంపడం సాధ్యం కాదు.

★ ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.

★ కలం పేరు ఉపయోగించే వారు అసలు పేరు, పూర్తి చిరునామా హామీ పత్రంతో ఇవ్వాలి

★ బహుమతుల నిర్ణయంలో, సాధారణ ప్రచురణకు అంగీకరించే నవలల విషయంలో ఎడిటర్ నిర్ణయం తుది నిర్ణయం.

★ నవలలు ''ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, డోమలగూడ, హైదరాబాదు-500 029'' అడ్రెసుకు పంపవలసి ఉంది.

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ: 31 జనవరి 1981**

పి. వి. కె. రావ్, B.A.

సెక్స్ స్పెషలిస్ట్
(వైద్య విద్వాన్-వైద్యాచార్య)
వివాహము వాయిదా వేయ నవసరము లేదు. దురభ్యాస ములవలన కలిగిన నరముల బలహీనత, సుఖవ్యాధులకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు ... ...
రావూస్ క్లినిక్,
టి.బి.రోడ్, తెనాలి. ఫోన్: 700.

దేహపుష్టికి ఆరోగ్యానికి
పండిత. డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17.

మీకుపయోగించేది
ఇంట్లో ఎవరికే రోగం వచ్చినా కంగారు పడేపనిలేదు. ఐదురకాల ప్రఖ్యాత వైద్యుల ప్రతిరోగానికి, రోగలక్షణాలు, వాటి నివారణకు ఇంగ్లీషు, ఆయుర్వేద, ప్రకృతి, మూలిక, హోమియో మందులు, "ఐదువైద్య విధానాలు" అనే తెలుగు పుస్తకంలో అందరికీ తెలిసేలా వ్రాశారు. అన్ని షాపుల్లో దొరికే మందులే. 427 రోగాలు నయము చేసుకొనే మార్గాలున్నాయి. వెలరూ. 16. పోస్టు ఖర్చులదనం. దేశసేవ ప్రచురణాలు, 5/3 ఆర్.టి. పంజాగుట్టకాలని, హైదరాబాదు-4. కు, మీకో పుస్తకం వి.పి. పోస్టులో పంపుమని వెంటనే వ్రాయండి.

ఉచితం ! ఉచితం !
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎగావు ... మా ప్రఖ్యాత మందు ... మార్చును. ... చర్మము ... రంగు పొందును. ప్రచారము ... ఒక సీసా మందు ఉచితంగా ... వెంటనే వ్రాయండి. వివరాలకు
BHARAT AYURVEDASHRAM
P.O. Katri Sarai (GAYA)

దాకా ఎక్కడా మంచినీళ్ళు కూడా దొరకవు" అన్నాడు మోహన్.

నలుగురం దిగేము. నల్ల అక్షరాలతో చిన్న పసుపు పచ్చ బోర్డు మీద 'లంబసింగి' అని వూరు పేరు కనుపిస్తూంది.

రెల్లుగడ్డితో వేసిన పాకలు నాలుగయిదు ఉన్నాయి. ఇప్పుడిప్పుడే నాగరిక బాటలోకి అడుగుపెడుతున్న గిరిజనులు కాస్త శుభ్రమైన దుస్తుల్లో కనుపిస్తున్నారు. మెడల నిండా పూసల దండలు, చెల్లని పాత రూపాయి బిళ్ళల దండలు, దట్టంగా పెరిగిన తలలతో మనుషులు విచిత్రంగా ఉన్నారు.

రోడ్డు పక్కగా పనసపళ్ళు కుప్పలుగా పేర్చి అమ్ముతున్నారు.

చిన్న టీ కొట్టు బయట నిలుచుని టీ తెప్పించుకుని సిప్ చేస్తున్నాము.

మంచు తెరలు విడిపోయేయి. సూర్యుడు శుభ్రంగా తళతళా మెరుస్తున్నాడు. ప్రకృతి మనోజ్ఞంగా చిత్రకారుడు వేసిన ముదురు రంగుల మిశ్రమ చిత్రంలా ఉంది.

ఉన్నట్టుండి ఏదో రాగం వినిపించింది. రాగం సొంపు శ్మశానంలో శవాన్ని పంచుకునేటప్పుడు నక్కలు దెబ్బలాడుకుంటున్నట్టుంది. చీదరగా వెనక్కు చూసేను. ఎవరో గుడ్డి బిచ్చగాడు పాడుతూ చేతికర్ర సాయంతో తడుముకుంటూ నడుస్తున్నాడు. పదిహేను, పదహారేళ్ళు ఉంటాయేమో? ఒంటిమీద ఉన్న చిరిగిన నిక్కరు పుట్టినప్పటినుంచి ఆదొక్కటే వాడేసుకున్నదని నిరూపిస్తూంది. నల్లని పాత బనియను ఎప్పటిదో తెలియదు. జుట్టు బాగా పెరిగి చిందర వందరగా వంకీలు తిరిగి ఉంది. ఒక చేతిలో సత్తు గిన్నె.

పాట మధ్యలో 'అమ్మా, ధర్మం', 'బాబూ ధర్మం' అని గట్టిగా అరుస్తున్నాడు. గొంతు దీనంగా పలుకుతూంది.

హఠాత్తుగా ఏదో ఆలోచన స్ఫురించినట్టు— 'ఇదిగో, ఇలా రా,' అని కేక వేసి పిలిచింది సంధ్య. తడబడుతున్న అడుగులతో మమ్మల్ని సమీపించేడు.

"నీ పేరేమిటి?" ప్రశ్నించింది సంధ్య.

"సింహాచలమమ్మా."

"నీ చూపు ఎలా పోయింది?"

"నా కైదారేళ్ళు ఉన్నప్పుడు బస్సు పెమాదంలో కళ్ళు పోనాయమ్మా." సింహాచలం గొంతు జీరగా పలికింది.

సంధ్య ఆలోచన లీలగా అర్థమయింది నాకు. శ్రీవారు, మోహన్ శ్రద్ధగా వాళ్ళ మాటల్ని వింటున్నారు.

"లెటజ్ మేక్ ఏన్ ఎక్స్‌పెరిమెంట్ విత్ హిమ్."

ఆభ్యర్థనగా మోహన్ కేసి చూస్తూ అడిగింది సంధ్య. మోహన్ అంగీకార సూచకంగా తలవూపేడు.

"ఆపరేషన్ చేసి నీ కళ్ళు తెప్పిస్తాము. మాతో వస్తావా?" సంధ్య ప్రశ్నలో ఆందోళన.

"వత్తా నమ్మా! నాకు సూపొత్తే ఒక్కపాలి ఈ మడుసుల్ని, ఈ పెపంచకాన్ని సూత్తే సాలు. అంత కన్నా ఈ పాడు జీవితంలో నా కేటీ వొద్దు." సింహాచలం స్వరంలో ఆశ. జీవం లేని కళ్ళలో తడి పొర.

సింహాచలాన్ని తీసుకుని కారులో బయలుదేరాము.

• • •

కాలవాహినిలో మూడు నెలలు కరిగిపోయాయి. సంధ్య సింహాచలం ఆపరేషన్ కోసం చాలా కష్టపడింది. ఇద్దరు కో—డాక్టర్ల సహాయంతో సంధ్య చేసిన ఆపరేషన్ సక్సెస్ అయింది. చూపు వచ్చిన రోజు సింహాచలం ఆనందం చెప్ప నలవికాదు. ఈ ప్రపంచంలోని సంతోషం అంతా సింహాచలం మొహంలో చూశాన్నేను.

మోహన్, సంధ్య, నేను, శ్రీవారు ఆ వేళ పార్టీ చేసుకుని సంతోషంగా గడిపాము.

సింహాచలం మోహన్ ఇంట్లోనే తోట పనివాడుగా ఉండిపోయేడు. పగలంతా తోట పని, ఏమైనా బజారు పని ఉంటే చూసేవాడు. సంధ్య పెట్టినదేదో తిని వరాండాలో పడుకునేవాడు. అప్పుడప్పుడు శ్రీవారు, నేను వెళ్ళి సింహాచలాన్ని పలకరించేవాళ్ళం.

ఒకసారి మాటల సందర్భంలో, "ఇదేమిటి? ఈ సింహాచలం బొత్తిగా జడపదార్థంలా ఉన్నాడు. ఎప్పుడూ 'నా కిది కావా'లని కూడా అడగడం లేదు" అంది సంధ్య.

నా కెందుకో నా వాదన నిజమైనదనిపించింది. శ్రీవారికేసి గర్వంగా చూశాను. శ్రీవారు ఏమీ మాట్లాడలేదు.

మరో మూడు నెలలు గడిచిపోయాయి.

రాత్రి పదకొండు అవుతూంది. వంటింట్లో గిన్నెలూ అవీ సర్దేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాను.

ఫోన్ ట్రింగ్, ట్రింగ్ మని మోగింది. అలసటగా ఉన్న శ్రీవారు విసుగ్గా లేచి ఫోన్ అందుకున్నారు. ఫోన్‌లో మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

"హలో, సంధ్యా! ఏమిటే ఇంత రాత్రప్పుడు?"

" . . . . . . . . . "

"ఎక్కడినుంచి? ఆస్పత్రి నుంచా?"

" . . . . . . . . . "

"ఏం జరిగింది?" శ్రీవారి స్వరంలో ఆందోళన.

" . . . . . . . . . "

"సింహాచలానికి ఏక్సిడెంటా?"

" . . . . . . . . . "

"ఎలా? ఎలా జరిగింది?"

"ఎదురింటి లాయరుగారి పనిమనిషితో ప్రేమలో పడ్డాడట. నేను గమనించనే లేదు. ఈ రాత్రి పది గంటలప్పుడు ఆ పనిమనిషిని లేవదీసుకుపోవాలని ఇంట్లో రెండు వందలు తీసుకొని రోడ్డు దాటుతూండగా లారీ డాష్ ఇచ్చింది." అస్పష్టంగా సంధ్య కంఠం వినిపిస్తూంది.

"దెబ్బలు బాగా తగిలాయా?" శ్రీవారి కంఠంలో ఆత్రత.

"కళ్ళు పోయేయి." నిర్లిప్తంగా సంధ్య సమాధానం. శ్రీవారు ఫోన్ వదిలేసి నిశ్చేష్టులై నిలబడ్డారు. నా మనస్సంతా ఆదోలా అయిపోయింది.

ఎదురుగా టేబుల్ మీద బుద్ధ విగ్రహం నన్ను చూసి నవ్వినట్టయింది. 'కోరికలే దుఃఖానికి మూల కారణం.' బుద్ధుని ఉపదేశం నా చెవిలో ఎవరో అరిచి చెప్పినట్టయింది. ★